నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 28 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL


దండారీ బృందం సభ్యుల పాదాలను నీటితో కడుగుతున్న ఆదివాసీ యువకులు


తిలకం దిద్దుతూ..


అతిథులను మర్యాద పూర్వకంగా కలుస్తూ..


రోకలు దుడ్డును నీటితో కడుగుతూ..


ఏత్మాసుర్ పేన్‌దేవతకు మొక్కుతూ..


దండారీ ఉత్సవాల్లో గుస్సాడీలు


పూజలు అందుకున్న ఏత్మాసుర్ పేన్ దేవతలు


డప్పులను కొడుతూ..


ఏత్మాసుర్ పేన్ దేవతకు పూజలు చేస్తూ..


మర్యాద పూర్వకంగా కలుసుకుంటూ..


నృత్యాలు చేస్తూ..


ఏత్మాసుర్ పేన్ దేవతలకు సమర్పించిన నైవేద్యాన్ని పంచుకుంటూ..


ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న గుస్సాడీలు

# దండారీ ధూంధాం

## ఏజెన్సీలో వైభవంగా ఉత్సవాలు

- గుస్సాడీలకు అతిథి మర్యాదలు
- తిలకం దిద్ది.. హారతిచ్చి స్వాగతం..
- ఆకట్టుకున్న నృత్యాలు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 27 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో దండారీ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీపావళి సందర్భంగా దండారీని ఆదివాసులు పవిత్రంగా భావిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఇతర గ్రామాలకు చెందిన గుస్సాడీ బృందాలను తమ గ్రామాలకు ఆహ్వానించి వారికి అతిథి మర్యాదలు చేస్తారు. దండారీ బృందం సభ్యులు కూడా అతిథి మర్యాదలు స్వీకరిస్తారు. ఇంద్రవెల్లి మండలంలోని తేజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సాలేగూడకు చెందిన దండారీ బృందం సభ్యులు డోంగర్‌గాం గ్రామానికి శనివారం రాత్రి అతిథులుగా వెళ్లారు. సభ్యులకు డోంగర్‌గాం గ్రామస్తులు సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ గుస్సాడీల చేతిలోని రోకలు దుడ్లను పురుషులు, మహిళలు, యువకులు వేర్వేరుగా నీటితో కడుగుతూ స్వాగతించారు. మహిళల ఆధ్వర్యంలో గుస్సాడీలతోపాటు బృందం సభ్యులకు తిలకం దిద్ది, హారతి ఇచ్చారు. ఏత్మాసుర్ పేన్ దేవతలకు పూజలు చేసిన అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు గుస్సాడీలతోపాటు దండారీ బృందం సభ్యులు చేసిన వివిధ రకాల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పెందూర్ బాధుపటేల్, పెందూర్ బండు, సేడ్మరావ్, రాము, కోవ భీంరావ్, మడావి లచ్చు పటేల్, మడివి సురేశ్ పాల్గొన్నారు.

### ఇంద్రాదేవి పూజలు..

ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవమైన ఇంద్రాదేవి ఆలయంలో ధర్మగూడ గ్రామానికి చెందిన దండారీ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పిప్రి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్కుగూడ గ్రామాల్లో బోగి పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు.


సంప్రదాయ నృత్యం చేస్తూ..


అమ్మవారి సన్నిధిలో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు

# అమ్మవారిని దర్శించుకున్న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు

బాసర, అక్టోబర్ 27 : బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, కమిషన్ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారిని అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### నేడు ఆదిలాబాద్‌కు..

ఎదులాపురం, అక్టోబర్ 27 : స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనపై ప్రభుత్వం నియమించిన బీసీ కమిషన్ జిల్లాలవారీగా బహిరంగ విచారణ చేపట్టనుందని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి రాజలింగు అన్నారు. ఇందులో భాగంగానే తొలుత ఉమ్మడి జిల్లాకు సంబంధించి బహిరంగ విచారణ సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారని తెలిపారు. కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి విచారణ నిమిత్తం ఆదిలాబాద్‌కు రానున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, కుల సంఘ ప్రతినిధుల నుంచి దరఖాస్తులతోపాటు సూచనలను స్వీకరించనున్నారని తెలిపారు. రూ.20 స్టాంపు పేపర్‌పై ప్రభుత్వ నోటరీ సంతకంతో ఆక్షేపణలను కమిషన్‌కు సమర్పించవచ్చని సూచించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

ఎదులాపురం, అక్టోబర్ 27 : ఒక అవకాశం ఇవ్వండి సమస్యలు పరిష్కరిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ఆదివారం ట్రస్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుతోపాటు ప్రైవేట్ పాఠశాలల నుంచి బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని సమావేశం నిర్వహించారు. శేఖర్‌రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులతోపాటు యాజమాన్యాల సమస్యలు తనకు తెలుసని, పట్టభద్రుల ఎమ్మెల్సీలో గెలిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. అనంతరం ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ట్రస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు రంగినేని పవన్‌రావు, వకులాభరణం అదినాథ్, కోశాధికారి దేవేందర్ పటాస్కర్, పురుషోత్తం రెడ్డి, అతీక్ ఉర్ రహ్మాన్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు


నృత్యార్చన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈవో విజయ రామారావు

## నృత్యార్చన కార్యక్రమం ప్రారంభం

బాసర, అక్టోబర్ 27 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలోని కోటి గాజుల మండపంలో ఆదివారం శ్రీ జ్ఞాన సరస్వతీకి నృత్య అర్చన అనే సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభం అయింది. శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళానృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఈవో విజయరామారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

# రోగుల భద్రతపై నీలినీడలు

## ఐదు నెలల్లో రెండు అగ్ని ప్రమాదాలు

- జిల్లా ప్రధాన ఆసుపత్రి నిర్వహణపై విమర్శలు
- తరచూ ప్రమాదాలపై అనుమానాలు


నిర్మల్‌లోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి

నిర్మల్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు భద్రత కరువైంది. తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదు నెలల క్రితం ఆసుపత్రిలోని మొదటి అంతస్తులో గల మీటింగ్ హాల్‌లో ఏసీ నుంచి మంటలు వ్యాపించగా.. అప్రమత్తమైన సిబ్బంది మంటలను ఆర్పివేశారు. తాజాగా గత ఆదివారం మళ్లీ మొదటి అంతస్తులోనే అగ్ని ప్రమాదం సంభవించింది. శానిటేషన్ సామగ్రిని భద్రపరిచే గదిలో మంటలు వ్యాపించాయి. ఈ రెండు ఘటనలకు షార్ట్ సర్క్యూటే కారణమని చెబుతున్నప్పటికీ.. ఆయా ఘటనల వెనుక ఎవరైనా ఉన్నారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగిన గదులకు సమీపంలోనే రోగులు చికిత్స పొందే వార్డులు ఉన్నాయి. ఒక వేళ అక్కడి వరకు మంటలు వ్యాపించి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇక్కడి ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కాకుండా కార్పొరేటు స్థాయి వైద్య చికిత్సలను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆసుపత్రుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని రోగులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు ఆసుపత్రి నిర్వహణను గాలికొదిలేయడం వల్లనే తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలోని అన్ని ఆసుపత్రులకు రోల్‌మోడల్‌గా నిలవాల్సిన జిల్లా ప్రధాన ఆసుపత్రిలోనే రోగుల భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

### అన్నీ అనుమానాలే..

జిల్లా నలుమూల నుంచి వందల సంఖ్యలో రోగులు జిల్లా ఆసుపత్రికి చికిత్సల కోసం వస్తుంటారు. రోగులతో కిటకిటలాడే ఆసుపత్రిలో వరుస ప్రమాదాలు జరగడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. రోగులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వ వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించకుండా, ప్రైవేటుగా ఆసుపత్రులను నిర్వహిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సమయపాలన పాటించకుండా డాక్టర్ల కోసం రోగులు గంటల తరబడి ఎదురు చూసేలా చేసి వారికి ప్రభుత్వ ఆసుపత్రులంటేనే అసహ్యం కలిగేలా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తరచూ ప్రమాదాలను సృష్టించి ప్రభుత్వాసుపత్రిపై రోగులకు నమ్మకం సన్నగిల్లిలా ఎవరైనా యత్నిస్తున్నారా? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అగ్ని ప్రమాదాలను నిలువరించేందుకు నీటి పైప్‌లైన్ వ్యవస్థ అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించే పరిస్థితి లేదు. ప్రమాదం జరిగిన ప్రతిసారి ఫైర్ ఇంజిన్ వచ్చే వరకు ఎదురు చూడాల్సిందే.

### ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలి..

వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్న జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన పరికరాలను మేయింటెనెన్స్ చేయాలి. తరచూ షార్ట్ సర్క్యూట్‌కు కారణమవుతున్న వైరింగ్‌ను మార్చాలి. నాణ్యమైన కేబుల్‌తో విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలి. అలాగే ప్రభుత్వ వైద్యంపై రోగుల్లో నమ్మకం పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించి, సక్రమంగా వైద్య చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలి. జిల్లా ఆసుపత్రితోపాటు జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అగ్ని ప్రమాదంతో స్టోర్ రూంలో దగ్ధమైన వస్తువులు(ఫైల్)

